

ప్రతిపాదనకే పరిమితమా?

మరుగున పడిన
ఏసీపీ కార్యాలయ నిర్మాణం
పట్టించుకోని అధికారులు
డీజీపీ హామీ ఇచ్చినా
అమలుకు నోచని వైనం

6



లబ్ధిదారులకు ప్రభుత్వ ఫలాలు అందాలి

» ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఫలాలు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు అందాలని అధికారులు చొరవ తీసుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. కడ్తాల్, ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల్లో గురువారం నారాయణరెడ్డి పర్యటించారు. పలు చోట్ల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి పనులు వేగవంతం చేసుకోవాలని సూచించారు. పలువురికి మంజూరైన రూ.1.56 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో 25 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఏర్పాటు చేస్తున్నామని, వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతానర్సింహ, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భట్టు కిషన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీలు నిట్ట నారాయణ, జక్కు అనంతరెడ్డి, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, నాయకులు సూదిని కొండల్ రెడ్డి, బొజ్జ సాయిరెడ్డి, బాబా, శ్రీనివాస్ రెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

» చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య


ఇందిరమ్మ ఇంటి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

మొయినాబాద్ రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని చిలుకూరు, హిమాయత్‌నగర్, మొయినాబాద్ వార్డు పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని చెప్పారు. పేదల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. సీనియర్ నాయకులు షాబాద్ దర్శన్, పీఏసీఎస్ చైర్మన్ మండడి చంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ మొయిజుద్దీన్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కాలె శ్రీకాంత్, ఎల్లపల్లి శ్రీనివాస్ యాదవ్, హన్మంత్‌యాదవ్, రాజేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నంలో రక్తదానం చేస్తున్న పోలీసులు

పోలీస్ అమరవీరుల స్ఫూర్తిని కొనసాగిద్దాం

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రజల రక్షణ కోసం ప్రాణ త్యాగం చేసిన పోలీసుల స్ఫూర్తిని కొనసాగించాలని తెలంగాణ రాష్ట్ర స్పెషల్ పోలీస్ మూడో బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ బాషా అన్నారు. పోలీస్ సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఇబ్రహీంపట్నంలోని మూడో బెటాలియన్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే నేరాలను అదుపు చేయడం సులువవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమాండెంట్ శ్రీనివాస్‌రావు, అసిస్టెంట్ కమాండెంట్లు పాండు, శ్రీనివాస్, డా.రవి పాల్గొన్నారు.


దేవరయాంజాల్ దేవాలయ భూముల్లో అక్రమంగా నిర్మిస్తున్న గోదాములు

దేవుడి భూములకే ఎసరు పెట్టారు. ఎకరా రూ. కోట్లు పలికే విలువైన ఆలయ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. రాష్ట్ర రాజధానికి కూతవేటు దూరంలోని దేవరయాంజాల్ శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయానికి చెందిన కోట్ల విలువ చేసే వందల ఎకరాల్లో అక్రమణల పర్వం ఆగడం లేదు. ఆక్రమించిన భూముల్లో పెద్దపెద్ద గోదాములు నిర్మిస్తూ లక్షల్లో అద్దె వసూలు చేస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు తూతూమంత్రంగా చర్యలు చేపడుతూ మమ అనిపిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది.

అయ్యో రామా!

వందల ఎకరాల దేవుడి మాన్యానికి ఎసరు
గోదాములు నిర్మించి రూ.లక్షల్లో అద్దె వసూలు
బీఆర్ఎస్ హయాంలో త్రిసభ్య కమిటీ విచారణ
అయినా ఆగని కబ్జా.. పట్టించుకోని అధికారులు
దేవరయాంజాల్‌లో ఆక్రమణల పర్వం

ఆలయ భూములు అన్యాక్రాంతం

మేడ్చల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్‌లో అతిపురాతనమైన శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం ఉంది. నిజాం హయాంలో ఓ భక్తుడు ఆలయానికి 1,500 ఎకరాల భూమిని విరాళమిచ్చాడు. సర్వే నంబర్లు 55 నుంచి 63, 631, 639, 656, 657, 660, 682, 686 నుంచి 718, 736లో ఈ భూమి విస్తరించి ఉండగా ప్రస్తుతం ఎకరా రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు పలుకుతోంది. అయితే 1925 వరకు శ్రీ సీతారామచంద్ర స్వామి పేరిట రికార్డుల్లో ఉండగా క్రమక్రమంగా శ్రీ సీతారామచంద్రస్వామి పేరు కాస్త సీతారామరెడ్డి, సీతా రామారావు, సీతారాములుగా మారిపోయి కబ్జాదారుల పేరిట రికార్డుల్లో మార్పులు జరిగాయి. అప్పటి నుంచి మొదలైన రికార్డుల్లో మార్పుల పర్వం ఇప్పటివరకు కొనసాగుతూనే ఉంది. ఇలా వందల ఎకరాల రామాలయ భూములు అన్యాక్రాంతమయ్యాయి. అక్రమార్కులు తమ తెలివితేటలను ఉపయోగించి రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకుని కబ్జాలకు తెరలేపారు.


దేవరయాంజాల్‌లోని రామాలయం

గోదాములు, రిసార్ట్‌లు, విలాసవంతమైన భవనాలు

అక్రమాలకు గురైన దేవాదాయ భూముల్లో కబ్జాదారులు పెద్దపెద్ద గోదాములను, రిసార్ట్‌లను, విలాసవంతమైన భవనాలను నిర్మిస్తున్నారు. ఇటు రింగు రోడ్డుకు, అటు నగరానికి కూతవేటు దూరంలో ఉండటంతో

మిగతా 7వ పేజీలో...

ఫోర్జరీ చేసి ఆక్రమించారు



దేవరయాంజాల్ పరిధిలోని సర్వే నంబర్లు 639, 640, 641లో దేవాదాయ శాఖ భూములను కొందరు బడాబాబులు, దళారులు, అక్రమార్కులు ఫోర్జరీ చేసి అనుమతులు లేకుండా దర్జాగా పెద్దపెద్ద గోదాములను నిర్మించారు. ప్రతి నెలా అద్దెలతో లక్షలకు, లక్షలు దండుకుంటున్నారు. ఇంత జరిగినా దేవాదాయ, రెవెన్యూ శాఖల అధికారులు చోద్యం చూస్తున్నారు. ఆలయాల భూములను కాపాడాలని గ్రామస్తులు ఎన్నోసార్లు కలెక్టర్‌కు విన్నవించినా ఫలితం లేదు. హైడ్రా రంగంలోకి దిగి ఆలయ భూములను రక్షించాలి.

- దండోద్కర్ రాజ్‌మోహన్, దేవరయాంజాల్

ట్రిపుల్‌ఆర్ అలైన్మెంట్‌ను

మార్చాలి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కందుకూరి జగన్


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కేశంపేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ట్రిపుల్ ఆర్ అలైన్మెంట్ మార్చేవరకూ పోరాడుతామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కందుకూరి జగన్, డివిజన్ కార్యదర్శి రాజు నాయక్ అన్నారు. కేశంపేట మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం నిర్దవెల్లి, తొమ్మిదిరేకుల గ్రామాలకు చెందిన ట్రిపుల్ ఆర్ నిర్వాసితులతో కలిసి ఒక్క రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఆరు మండలాల్లో 26 గ్రామాల మీదుగా వస్తున్న ట్రిపుల్ ఆర్ అలైన్మెంట్ మార్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన సర్వే నంబర్లు చిన్న, సన్నకారు రైతులవే అన్నారు. ఎకరం, రెండు ఎకరాలు ఉండే రైతుల పొలాల నుంచి రోడ్డు వేస్తే వారు జీవనోపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. అలైన్మెంట్ మార్చకుంటే రైతులతో కలిసి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం షాద్‌నగర్ డివిజన్ కార్యవర్గ సభ్యుడు శ్రీనునాయక్, మండల కన్వీనర్ బేరి శ్రీనివాస్, రైతు సంఘం నాయకులు కానుగుల వెంకటయ్య, పోగుల భీమయ్య, కృష్ణారెడ్డి, బాలరాజు, గోవర్ధన్ గౌడ్, రంగయ్య, జంగయ్య, శ్రీనివాస్ రెడ్డి, చెన్నారెడ్డి, బుచ్చి రెడ్డి, వెంకట్ రెడ్డి, బాలయ్య మహేష్, శీను తదితరులు పాల్గొన్నారు.

ఆదాయానికి సిండికేట్ గండి

మద్యం షాపులకు ముగిసిన దరఖాస్తుల స్వీకరణ

డివిజన్ల వారీగా దరఖాస్తులు

డివిజన్	దుకాణాలు	దరఖాస్తులు
సరూర్‌నగర్	138	7,761
శంషాబాద్	111	8,306
మేడ్చల్	118	5,791
మల్కాజిగిరి	88	5,069
వికారాబాద్	59	1,808
మొత్తం	514	28,735



గతం కంటే 10 వేలు
తగ్గిన దరఖాస్తులు
ఉమ్మడి జిల్లాలో 28వేల పైనే స్వీకరణ
చివరి రోజు వెయ్యి లోపే దరఖాస్తులు
ఉమ్మడి జిల్లాలో మొత్తం 514 దుకాణాలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): ఆబ్కారీ శాఖకు రాష్ట్రంలోనే అత్యధిక ఆదాయం తీసుకొచ్చే రంగారెడ్డి జిల్లాలో ఈ సారి మద్యం షాపుల కేటాయింపునకు ముందుగానే సర్కార్ ఆదాయానికి గండి పడింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 514 మద్యం దుకాణాలు ఉండగా ఇందులో రంగారెడ్డి జిల్లాలో 249, మేడ్చల్ జిల్లాలో 206, వికారాబాద్‌లో 59 దుకాణాలు ఉన్నాయి. ఈ షాపుల కేటాయింపునకు (2025-27) సంబంధించి గత సెప్టెంబరు 26 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న

మిగతా 7వ పేజీలో...


చివరిరోజు ఖాళీగా దర్శనమిస్తున్న కౌంటర్లు

27వ తేదీన లాటరీ

మద్యం దుకాణాల కోసం వచ్చిన దరఖాస్తులను 27వ తేదీన లాటరీ తీసి దుకాణాలను కేటాయించనున్నారు. లాటరీలో దుకాణం దక్కిన వారికి 2025 డిసెంబరు 2 నుంచి 2027 నవంబరు 30 రెండేళ్ల కాలపరిమితితో లైసెన్స్ జారీ చేస్తారు. మద్యం దుకాణాల కేటాయింపులో ఎస్సీ, ఎస్టీ, గౌడ్‌లకు కొన్ని షాపులు రిజర్వుడు చేసిన విషయం తెలిసిందే.

వైద్య వృత్తి పవిత్రమైనది

» ఎమ్మెల్సీ, ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్ రెడ్డి


మాట్లాడుతున్న పట్నం మహేందర్‌రెడ్డి

చేవెళ్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని ఎమ్మెల్సీ, ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్ రెడ్డి అన్నారు. గురువారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాలలో అధ్యాయ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. బాగా చదువుకుని మంచి వైద్యులుగా పేదలకు వైద్యం అందించాలని సూచించారు. అందరి సహకారంతో మహేందర్‌రెడ్డి జనరల్ ఆసుపత్రి వైద్య కళాశాలను త్వరలోనే డీమ్డ్ యూనివర్సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లాలోని అన్ని ఆస్పత్రులకంటే భిన్నంగా ఎక్కువ మంది పేదలకు ఉచితంగా వైద్యాన్ని అందిస్తున్నామని చెప్పారు. మున్ముందు మరిన్ని మండలాల నుంచి, ఇతర జిల్లాల నుంచి ఉచితంగా బస్సు సౌకర్యం కల్పిస్తూ పేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంఘటితమవుదాం..

రాజ్యాధికారాన్ని సాధిద్దాం

» బీసీ సేన జాతీయ అధ్యక్షుడు కృష్ణ


నియామకపత్రాన్ని అందజేస్తున్న బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ

షాబాద్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బీసీలంతా సంఘటితమై రాజ్యాధికారాన్ని సాధిద్దామని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. గురువారం షాబాద్‌లో పీఆర్ఆర్ మినీ స్టేడియంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ జేఏసీ మండల కమిటీని ఎన్నుకున్నారు. కుల సంఘాల జేఏసీ మండల అధ్యక్షుడిగా మల్లి వెంకటేశ్, ఉపాధ్యక్షుడిగా రాంచంద్రయ్య యాదవ్, విఠలయ్య, ప్రధాన కార్యదర్శిగా రాంచందర్, కార్యదర్శులుగా ఎక్బాల్, రవీందర్ చారి, సభ్యులుగా శ్రీనివాస్‌గౌడ్, రమేశ్, ఆంజనేయులు, అబ్బాస్, హన్మంతు, మల్లేష్, అజయ్, జంగయ్య, రాములు, శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బర్క కృష్ణ మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఏకమై రాజ్యాధికారం దిశగా కదలాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సేన మండలాధ్యక్షుడు దయాకర్‌చారి, యూత్ నాయకులు అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

» చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని కేవీఆర్ కార్యాలయంలో రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల ఆర్‌బీఐ, విడ్స్ సంస్థ, ఎల్‌డీఎంలతోపాటు కేంద్ర ప్రభుత్వంచే లబ్ధి పొందిన వారితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న జీవన్ జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన, సుకన్య సమృద్ధి యోజన, ముద్రా రుణాలు వంటి పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాని కోరారు. రూ.20 చెల్లించి సురక్ష బీమా యోజనలో చేరాలని సూచించారు. ప్రజల జీవితాల్లో ఆర్థిక క్రమశిక్షణ నేర్పిస్తూ వారి ఆర్థిక ప్రగతికి ఈ పథకాలు దోహదం చేస్తాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల ఎల్‌డీఎంలు సుశీల్‌కుమార్, యాదగిరి, ఏరియా కోఆర్డినేటర్లు దయాకర్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.



యూనివర్సిటీలో డేటా ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న డీన్, అధ్యాపకులు

'అనురాగ్'లో డేటా ఫెస్ట్ ప్రారంభం

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ గురువారం డేటాఫెస్ట్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డీన్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. డేటా ఫెస్ట్‌తో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికితీసేందుకు దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో శ్రీదేవి, శ్రీజ, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపాదనకే పరిమితమా?

- మరుగున పడిన ఏసీపీ కార్యాలయ ఏర్పాటు
- పట్టించుకోని అధికారులు, నాయకులు
- డీజీపీ హామీ ఇచ్చినా అమలుకు నోచని వైనం
- ఎమ్మెల్యే కసిరెడ్డి, ఎంపీ మల్లు రవిలపై ఒత్తిడి

ఆమనగల్లు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులో ఏసీపీ కార్యాలయ ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమైంది. బీఆర్‌ఎస్ పాలనలో ఏసీపీ కార్యాలయం ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. కడ్తాలలో పోలీసుస్టేషన్ భవనం ప్రారంభం సందర్భంగా అప్పటి హోంమంత్రి మహమూద్‌అలీ, అప్పటి డీజీపీ అంజన్‌కుమార్‌యాదవ్‌లు రెండు మూడు రోజుల్లో కార్యాలయం ప్రారంభిస్తామని చెప్పారు. కొద్దిరోజులకే అసెంబ్లీ ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో కార్యాలయ ఏర్పాటు మరుగున పడింది.

నాలుగు మండలాలను కలిపి...

ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల, మాడ్గుల మండలాలతో ఏసీపీ కార్యాలయం ఏర్పాటుకు పోలీసు శాఖ ప్రతిపాదించింది. ప్రస్తుతం సైబరాబాద్ కమిషనరేట్‌లో ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి పీఎస్‌లు, రాచకొండ కమిషనరేట్‌లో మాడ్గుల పోలీసుస్టేషన్ ఉన్నాయి. అలాగే ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి పోలీసు స్టేషన్లు షాద్‌నగర్ ఏసీపీ పరిధిలో, మాడ్గుల ఇబ్రహీంపట్నం ఏసీపీ పరిధిలో కొనసాగుతున్నాయి. కల్వకుర్తి నియోజకవర్గంలోని ఈ మండలాలన్నింటిని ఒకే ఏసీపీ పరిధిలోకి తేవాలనే ఏసీపీ పాయింట్ ఏర్పాటుకు ప్రతిపాదించారు.



ఆమనగల్లు పోలీస్ స్టేషన్



డీజీపీ శివధర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు(ఫైల్)

విన్నపాలకు స్పందన కరువు

ఏసీపీ కార్యాలయం ఏర్పాటుకు చాలాకాలంగా ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో పోలీసు శాఖ కార్యాచరణ రూపొందించింది. షాద్‌నగర్ ఏసీపీ కార్యాలయం ఆమనగల్లుకు 50 కిలోమీటర్ల దూరంలో, ఇబ్రహీంపట్నం ఏసీపీ కార్యాలయం మాడ్గులకు 40కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. పనుల కోసం అక్కడికి వెళ్లాలంటే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల పలువురు నాయకులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లు రవిలను కలిసి ఏసీపీ కార్యాలయం ఏర్పాటుకు వినతిపత్రం అందజేశారు. అయినా స్పందన లేదు. ముచ్చర్ల వద్ద ఫోర్త్ సిటీ ఏర్పాటు నేపథ్యంలో ఆమనగల్లులో ఏసీపీ కార్యాలయం ఏర్పాటు అనివార్యం అని సీఎం రేవంత్‌రెడ్డిని స్థానికులు కోరుతున్నారు. ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేయాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, ఆమనగల్లు బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యనాయక్‌లు ఇటీవల డీజీపీ శివధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ఏసీపీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలి



నాలుగు మండలాల ప్రజలకు సౌకర్యంగా ఆమనగల్లులో ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేయాలి. మాడ్గుల పోలీసు స్టేషన్‌ను రాచకొండ కమిషనరేట్ నుంచి సైబరాబాద్‌కు మార్చి నాలుగు పోలీస్‌స్టేషన్లను కలిపి ఏసీపీ కార్యాలయం ఏర్పాటు దిశగా ఎంపీ, ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలి.

- రూపం వెంకట్‌రెడ్డి, చింతలపల్లి

అలైన్మెంట్ మార్పుపై అసత్య ప్రచారం

- రైతుల గోస తీసుకోకుండా ట్రిపుల్‌ఆర్ నిర్మించాలి
- మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



నిరాహార దీక్ష శిబిరం వద్ద మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కేశంపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): "హరీశ్‌రావు, సీఎం రేవంత్‌రెడ్డి మంచి మిత్రులని.. ఆయన కోసమే రేవంత్‌రెడ్డి సర్కార్ ట్రిపుల్‌ఆర్ అలైన్మెంట్‌ను మార్చుతున్నారని కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారు. ఒక వేళ హరీశ్‌రావు భూములుంటే నా తో రండి నేనే మాట్లాడి ట్రిపుల్‌ఆర్‌కు హరీశ్ భూమి ఇప్పిస్తా." అని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. కేశంపేటలో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ట్రిపుల్‌ఆర్ నిర్వాసితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు మద్దతు తెలిపి మాట్లాడారు. రింగ్ రోడ్డు అంటే రింగ్‌లా గుండ్రంగా ఉండాలని, కానీ ఔటర్ రింగ్ రోడ్డు నుంచి ఉత్తర భాగానికి 25కిలో మీటర్లు, దక్షణానికి 42 కిలో మీటర్ల దూరంలో భూమి సేకరిస్తే అది రోడ్డు రింగ్‌లా ఎలా అవుతుందో ప్రభుత్వమే చెప్పాలన్నారు. రైతులను గోసపెట్టి రోడ్డేస్తే ప్రభుత్వం బాగుపడదని హెచ్చరించారు. ట్రిపుల్‌ఆరే ముఖ్యమంటే చిన్న రైతులకు నష్టం కలగకుండా భూస్వాముల జాగల నుంచి రోడ్డు వేసుకోవాలన్నారు. అయితే ఈ మధ్య కాలంలో తొమ్మిదిరేకుల, నిర్దవెల్లి గ్రామాల్లో హరీశ్‌రావుకు పొ లాలున్నాయని, ఆయన కోసమే రేవంత్‌రెడ్డి సర్కార్ అలైన్మెంట్ మార్చిందని అసత్య ప్ర చారం చేస్తున్నారని, హరీశ్ పొలాలు ఎక్కడున్నాయో తనకు చూపిస్తే తానే ఆ భూమిని ట్రిపుల్‌ఆర్‌కు ఇపిస్తానని యాదయ్య చెప్పారు. రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎద్దు ఏడ్చిన యౌసం.. రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడ్డట్టు చరిత్రలో లేదని అన్నారు. ట్రిపుల్‌ఆర్‌కు రైతులకు మార్కెట్ ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, మాజీ వైస్‌చైర్మన్ లక్ష్మీనారాయ ణగౌడ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మురళీధ రొరెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, శ్రీశైలం పాల్గొన్నారు.



తాండూరు ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న సంపత్‌కుమార్

163వ సారి డాక్టర్ సంపత్‌కుమార్ రక్తదానం

తాండూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తాండూరు బాలాజీ నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ సంపత్‌కుమార్ అత్యవసరం నిమిత్తం తాండూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఓ గర్భిణికి రక్తదానం చేశారు. బషీరాబాద్ మండలం క్యాద్గిర గ్రామానికి చెందిన కుమ్మరి రూప ప్రసవానికి రక్తం అత్యవసరమని గ్రామస్తులు తెలపడంతో వెంటనే స్పందించిన డాక్టర్ సంపత్‌కుమార్ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశారు. ఇప్పటి వరకు ఆయన 163 సార్లు రక్తదానం చేశారు. డాక్టర్ సంపత్‌కుమార్‌కు రూప కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

పశు సంపదతోనే మానవ మనుగడ

- గో వధపై కఠిన చర్యలు తీసుకోవాలి
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య



బాబయ్యను గృహ నిర్బంధం చేసిన పోలీసులు

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పశు సంపదను పరిరక్షిస్తేనే మానవ మనుగడ సజావుగా కొనసాగుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అన్నారు. ఘట్కేసర్‌లో గోరక్షకులపై జరిగిన దాడికి నిరసన వ్యక్తం చేయకుండా గురువారం బాబయ్యను షాద్‌నగర్ పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఆయన మాట్లాడుతూ.. మాంసం కోసం చట్ట గోవులను చంపితే మానవ జీవనం విచ్ఛిన్నమవుతుందన్నారు. గో సంరక్షణను ప్రభుత్వం పట్టించుకోకుంటే సేంద్రీయ వ్యవసాయం దెబ్బతిందన్నారు. రసాయన మందులతో పండించిన పంట తింటున్న మనుషులు క్యాన్సర్ లాంటి ప్రాణాంతక రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మనుషుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఆవుల సంరక్షణకు అందరం పాటుపడాలని, గోవులను వధించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాబయ్య డిమాండ్ చేశారు. పోలీసులు బీజేపీ నాయకులను అరెస్టు చేయడం కాదని, ఆవులను చంపుతూ, గోసంరక్షకులపై దాడులు చేస్తున్న వారికి కఠినంగా శిక్షించాలని బాబయ్య అన్నారు.

మన్నెగూడ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన అసిస్టెంట్ కలెక్టర్



పూడూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెగూడ పోలీస్‌స్టేషన్‌ను వికారాబాద్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ హర్షచౌదరి సందర్శించారు. ఆయన గురువారం మన్నెగూడలోని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సిబ్బందితో మాట్లాడారు. వచ్చిన ఫిర్యాదులు, కేసుల వివరాలను ఎస్‌ఐ, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయనతో సిబ్బంది ఉన్నారు.

భిక్షాటనతో బోరు మోటార్ మరమ్మతు



మోటారు మరమ్మతు కోసం భిక్షాటన చేస్తున్న తండా యువకులు

తలకొండపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): తలకొండపల్లి మండలం హర్యానాయక్‌తండా వాసులు భిక్షాటన చేసి పంచాయతీ బోరు మోటార్‌ను మరమ్మతు చేయించుకున్నారు. తండాలోని 1వ వార్డులో బోరు మోటార్ కాలిపోయింది. దీంతో నీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మోటారుకు మరమ్మతులు చేయించాలని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకుపోతే అతడు నిధులు లేవని తెలిపినట్లు తండా యువకులు తెలిపారు. దీంతో నెల రోజులుగా పాడైన బోరును మరమ్మతు చేయకపోవడంతో నీటి ఎద్దడి నెలకొంది. సమస్యను తండాకు చెందిన గిరిజన ఐక్యవేదిక కో-ఆర్డినేటర్ కొర్ర కృష్ణనాయక్ దృష్టికి తీసుకుపోయారు. స్పందించిన కృష్ణనాయక్ యువకులతో కలిసి తండాలో భిక్షాటన చేశారు. రూ.వెయ్యి రాగా, మరో రూ.4వేలు కృష్ణనాయక్ తన సొంతంగా వెచ్చించి బోరు మోటర్‌కు మరమ్మతులు చేయించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేశ్, శంకర్, శ్రీను, వెంకటేశ్, రవి, భాస్కర్, శంకర్, శ్రీను, వినోద్, శివ, రాజేశ్, తదితరులు ఉన్నారు.

జేఏసీ ఆధ్వర్యంలో అర్ధనగ్న నిరసన



కొడంగల్‌లో అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

కొడంగల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కొడంగల్‌కు మంజూరైన మెడికల్ కళాశాల, పాత కొడంగల్‌లో ఇంటిగ్రేటెడ్ గురుకులాలను ఇతర ప్రాంతాలకు తరలించొద్దని, ఎక్కడ మంజూరు చేశారో అక్కడే నెలకొల్పాలని డిమాండ్ చేస్తూ కొడంగల్ అభివృద్ధి, పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. గురువారం పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. విద్యాసంస్థలను ఇతర ప్రాంతాలకు తరలించకుండా కొడంగల్‌లోనే ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. 15రోజులుగా నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణగుప్తా, సురేశ్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేసీఆర్‌తో మెతుకు ఆనంద్ ప్రత్యేక భేటీ



వికారాబాద్,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్ మాజీ సీఎం కేసీఆర్‌తో గురువారం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఇన్‌చార్జిలతో కేసీఆర్ హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించారు. అనంతరం కేసీఆర్.. ఆనంద్‌ను ప్రత్యేకంగా తన నివాసానికి ఆహ్వానించి రాజకీయ అంశాలపై మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడిగా బాగా పనిచేస్తున్నారని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని మెచ్చుకున్నారు.

విజనరీ టీచర్స్ మండల అధ్యక్షుడిగా మహేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ విజనరీ టీచర్స్ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడిగా బత్తుల మహేందర్‌రెడ్డి, కార్యదర్శిగా బాషయ్య, ఉపాధ్యక్షుడిగా ధర్మారెడ్డిలను ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం ఎంఈవో హీర్యానాయక్‌ను కలిసి ఉపాధ్యాయ సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు.

కాల్పులు జరిపిన నిందితుడిని అరెస్టు చేయాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

వికారాబాద్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గోరక్షక్ కమిటీ సభ్యుడు ప్రశాంత్‌సింగ్‌పై కాల్పులు జరిపిన నిందితుడిని అరెస్టు చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు గురువారం బీజేపీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. నిందితుడిని పట్టుకోవడంలో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులను, గోరక్షక్ సభ్యుల అరెస్టు అప్రజాస్వామ్యిక్మం అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాధవరెడ్డి, వడ్ల నందు, నరోత్తంరెడ్డి, పాండుగౌడ్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరంలో పాల్గొన్న వైఎస్సార్ ట్రస్ట్ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ ట్రస్టు చైర్మన్ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఎదులాబాద్ వార్డు కార్యాలయం ఆవరణలో గురువారం ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. రోజూ వ్యాయామం చేయాలన్నారు. వైఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో పదేళ్లుగా సమాజ సేవచేస్తున్నట్లు తెలిపారు. 800 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు, గ్రామస్తులు, సీనియర్ జర్నలిస్టు శ్రీశైలం, కృష్ణవేణి, ధర్మారెడ్డి, లక్ష్మణ్, సాయిలు పాల్గొన్నారు.

కరన్‌కోట్ ఇన్‌చార్జి ఎస్‌ఐగా విఠల్‌రెడ్డి



తాండూరు రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి ఎస్‌ఐగా విఠల్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న రాథోడ్ వినోద్‌కుమార్ వ్యక్తిగత పని నిమిత్తం సెలవులపై వెళ్లారు. దీంతో యాలాల ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న విఠల్‌రెడ్డికి కరన్‌కోట్ ఎస్‌ఐగా పోలీస్ ఉన్నతాధికారులు అదనపు బాధ్యతలను అప్పగించారు.

అయ్యో రామా!


దేవరయాంజాల్ దేవాలయ భూముల్లో అక్రమంగా నిర్మిస్తున్న గోదాములు

(ఐదో పేజీ తరువాయి)

గోదాములకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. దేవరయాంజాల్ ఆలయ భూముల్లో పలు పార్టీలకు చెందిన రాష్ట్ర నేతలు కూడా ఉండటంతో కబ్జాల పర్వానికి అడ్డూఅదుపూ లేకుండా పోయింది. ఇందులో అన్ని ప్రధాన పార్టీల నేతల హస్తం ఉండడంతో వీరి ఆగడాలకు అంతులేకుండా పోతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. బడాబాబులంతా ఒక రింగుగా ఏర్పడి ఇక్కడ ఎమ్మెల్యేగా ఎవరు గెలిచినా మరుసటి రోజు సదరు ఎమ్మెల్యేను కలిసి ఇంత ఇస్తాం.. ఇబ్బందులు రాకుండా చూడాలంటూ విన్నవించుకుంటారు. దీంతో అటువైపు కన్నెత్తి చూసే అధికారి.. ప్రశ్నించే నాథుడే లేకుండా పోయాడు.

హడావుడిగా త్రిసభ్య కమిటీ

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈటల రాజేందర్, బీఆర్ఎస్ నుంచి బయటకు రాగానే అప్పటి అతడిపై కక్షసాధింపు చర్యల్లో భాగంగా దేవరయాంజాల్ భూములపై త్రిసభ్య కమిటీని వేశారు. రఘునందన్‌రావు నేతృత్వంలో ముగ్గురు ఐఏఎస్ అధికారులతో కూడిన త్రిసభ్య కమిటీ క్షేత్రస్థాయిలో పలుమార్లు పరిశీలించింది. 2022 నవంబర్ 15న త్రిసభ్య కమిటీ 1,350 ఎకరాలు దేవాదాయ శాఖ భూములేనని, ఆ భూముల్లో నిర్మించినవి అక్రమమేనని తేల్చినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. ఆ తర్వాత ఈటల రాజేందర్ బీజేపీలో చేరడంతో త్రిసభ్య కమిటీ అటకెక్కింది.

రెచ్చిపోతున్న అక్రమార్కులు

త్రిసభ్య కమిటీ విచారణ తర్వాత చర్యలు చేపట్టకపోవడంతో దేవరయాంజాల్ భూముల్లో అక్రమార్కులు రెచ్చిపోయారు. ఇదే అదనుగా దేవాదాయ భూములను కబ్జా చేస్తూ నిర్మాణాలు చేపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అక్రమ నిర్మాణాలు పెరిగిపోయాయనే ఆరోపణలున్నాయి. పెద్దపెద్ద గోదాములు నిర్మిస్తున్నా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దేవరయాంజాల్‌లో రామాలయ భూములు అన్యాక్రాంతమవుతున్నాయనే విషయం షరా మామూలుగా మారింది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మిగిలివున్న ఆలయ భూములనైనా కాపాడాలని దేవరయాంజాల్ ప్రజలు కోరుతున్నారు.

ఆలయ భూములను అమ్ముకుంటున్నారు



దేవరయాంజాల్ పరిధిలోని దేవాదాయ శాఖకు చెందిన వేలాది ఎకరాల ఆలయ భూములు 40 ఏళ్లుగా అన్యాక్రాంతానికి గురవుతున్నాయి. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. దేవాలయ భూముల్లో కొందరు దళారులు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వసూలు చేసి గుడిసెలు, రేకుల రూములు వేయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఆలయ భూములను కాపాడాలని గ్రామ యువకులం పదేళ్లుగా ఉద్యమం చేస్తున్నాం. అయినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది.

- నేమూరి సాయికిరన్(బీటెక్ సాయి), దేవరయాంజాల్

చర్యలు తీసుకుంటాం

దేవరయాంజాల్ రెవెన్యూ పరిధిలోని దేవాదాయ శాఖకు చెందిన భూముల అన్యాక్రాంతంపై చర్యలు తీసుకుంటాం. అన్యాక్రాంతమైన ఆలయ భూములపై కోర్టుకు నివేదికలు సమర్పించాం. ప్రస్తుతం ఆలయ భూముల కబ్జాలపై కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయి. కోర్టు ఆర్డర్స్, దేవాదాయ శాఖ, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు ఆలయ భూములను రక్షించేందుకు తగు చర్యలు తీసుకుంటాం.

- యాదగిరిరెడ్డి, తహసీల్దార్, శామీర్‌పేట


సెమినార్‌లో మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్

సీజేఐపై దాడి అప్రజాస్వామికం

» హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు సీజే గవాయ్‌పై జరిగిన దాడి ప్రజాస్వామ్యంపైనే జరిగిన దాడి అని హైకోర్టు రిటైర్డ్ జడ్జి బి.చంద్రకుమార్ అన్నారు. ఈ దాడి వెనక ఎలాంటి శక్తులున్నా నిందితుడిని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు జరక్కుండా చూడాల్సిన అవసరముందని అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నంలోని వైష్ణవి గార్డెన్స్‌లో కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెమినార్‌లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలన్నారు. శాస్త్రసాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న ఈ తరుణంలో ఇలాంటి ఘటనలు సరైనవి కాదన్నారు. కేవీపీఎస్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కాడిగల్ల భాస్కర్ మాట్లాడుతూ.. బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలుకు రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌ను సవరించాలని డిమాండ్ చేశారు. 75సంవత్సరాల స్వతంత్ర్య దేశంలో మెజారిటీ కులాలైన బీసీలు విద్య, ఉద్యోగ అవకాశాలకు దూరంగా ఉన్నారని అన్నారు. జనాభాలో ఐదు శాతం కూడా లేని అగ్రకులాల వారికి పది శాతం రిజర్వేషన్లు కల్పించారని, ఇది ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సామేల్, ప్రకాశ్‌కారత్, నాయకులు అరుణ్‌కుమార్, జగన్, ఆలేటి ఆటం, వెంకటేష్, పురుషోత్తం, ఆనంద్, ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు తరంగ్, వంశీ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి

మాడ్గుల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను, గ్యారంటీలకు కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చుతోందని, కాగ్రెస్ పాలనతోనే అభివృద్ధి సాధ్యం అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మాడ్గుల రైతు వేదికలో గురువారం 63మందికి కల్యాణలక్ష్మి, 87మంది కేఎల్ఐ భూ నిర్వాసితులకు చెక్కులను పీసీసీ కార్యాదర్శి సూదిని రాంరెడ్డితో కలసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కల్యాణ లక్ష్మి సాయంలో కాలయాపన చేయొద్దని, దరఖాస్తు రాగానే ఆన్‌లైన్ చేసి త్వరగా మంజూరయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం పేదలకు రేషన్‌కార్డులు ఇవ్వలేదని, మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే పేదలందరికీ రేషన్‌కార్డులను అందించామని, ఆ ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందని కసిరెడ్డి అన్నారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామన్నారు. కల్వకుర్తి లిఫ్టుకు భూములు పోయిన రైతులకు పరిహారం ఇప్పించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వినయ్‌సాగర్, కాంగ్రెస్ నాయకులు సూదిని కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ బొజ్జ సాయిరెడ్డి, జెల్ల రమేష్‌గౌడ్, పాండుగౌడ్, కాట్ల యాదయ్యగౌడ్, జగన్‌గౌడ్, రంగారెడ్డి, వెంకటేశ్వర్లుగౌడ్, డీటీ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

9మంది సీనియర్ అసిస్టెంట్లకు డిప్యుటేషన్

» ఇతర మండలాలకు కేటాయింపు

వికారాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో పనిచేస్తున్న తొమ్మిది మంది సీనియర్ అసిస్టెంట్లు, ఎంఆర్ఐ, ఏఎంఆర్ఐలను ఇతర మండలాలకు డిప్యుటేషన్‌పై కేటాయిస్తూ కలెక్టర్ ప్రతీక్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు. బషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న టి.వెంకటయ్యను దోమ మండలానికి, దోమలో విధులు నిర్వహిస్తున్న సుదర్శన్‌ను పూడూరు మండలానికి కేటాయించారు. కొడంగల్‌లో పనిచేస్తున్న రాఘవేందర్‌రావును తాండూరు మండలానికి, కోట్‌పల్లిలో పనిచేస్తున్న లింగంను వికారాబాద్ మండలానికి కేటాయించారు. మర్పల్లి మండలంలో పనిచేస్తున్న టి.మాధవరెడ్డిని నవాబ్‌పేటకు, నవాబ్‌పేటలో పనిచేస్తున్న రజితారాణిని మర్పల్లి మండలానికి కేటాయించారు. పూడూరు మండలంలో పనిచేస్తున్న శ్రావ్యను కలెక్టరేట్‌లో డి - సెక్షన్‌కు కేటాయించగా, తాండూరు మండలంలో పనిచేస్తున్న గోపిని కొడంగల్ మండలానికి కేటాయించారు. వికారాబాద్‌లో పనిచేస్తున్న ఎల్.నరేశ్ కుమార్‌ను కోట్‌పల్లి మండలానికి కేటాయించారు.

స్కూలు భవనంపై నుంచి దూకి

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): యూనిట్ టెస్టులో మార్కులు తక్కువొచ్చాయని ఓ ఇంటర్ విద్యార్థి స్కూలు భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కీసర మండలం యాద్గార్‌పల్లికి చెందిన వెంకటరమణారెడ్డి బండ్లగూడలోని ప్రజాసాయి గార్డెన్‌లో ఉంటున్నాడు. అతడి కుమారుడు అభిచేతన్‌రెడ్డి(17) పోచారం మున్సిపాలిటీలోని ఓ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఎంపీసీ సెకండియర్ చదువుతున్నాడు. యూనిట్ టెస్ట్‌లో మార్కులు తక్కువగా వచ్చాయని, మనస్తాపానికి గురై స్కూల్ భవనం 3వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్కూల్ సిబ్బంది, యాజమాన్యం అతడిని వెంటనే మేడిపల్లి మండలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే అభిచేతన్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం

వికారాబాద్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వికారాబాద్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ భీమ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమంలో పాల్గొని సిద్ధార్థ పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. ప్రజా భద్రతను కాపాడటం, చట్టాలను పాటించి, పౌరహక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రజలకు సహాయం చేయటం, ప్రభుత్వ, కోర్టుల ఉత్తర్వులను పాటించటం, శాంతి భద్రతల పరిరక్షణ, నేరాలను అరికట్టటం పోలీసుల ముఖ్య విధులని చెప్పారు. స్టేషన్‌లో పోలీస్ అధికారుల, సిబ్బంది విధులు, ఆయుధాలు వినియోగం గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎస్సైలు గిరన్న, ప్రవీన్‌మీనాక్షి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదాయానికి సిండికేట్ గండి



(ఐదో పేజీ తరువాయి)



విషయం విదితమే. దరఖాస్తుల స్వీకరణకు గత శనివారంతో గడువు ముగిసినప్పటికీ ప్రభుత్వం మళ్లీ గురువారం వరకు గడువు పొడిగించింది. అయితే చివరి రోజైన గురువారం భారీగా దరఖాస్తులు వస్తాయని భావించినప్పటికీ వేయి లోపుగానే అందాయి. ఉమ్మడి జిల్లాలో కడపటి సమాచారం మేరకు 28,735 దరఖాస్తులు వచ్చాయి. కొన్ని డివిజన్లలో అర్ధరాత్రి వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగింది. మరో 150 నుంచి 200 దరఖాస్తుల వరకు పెరగవచ్చని అధికారులు తెలిపారు.

కొందరి కనుసన్నల్లోనే వ్యాపారం

ఇదిలా ఉంటే గతంతో పోలిస్తే దాదాపు 10వేలకు పైగా దరఖాస్తులు తగ్గాయి. ఏటా మద్యం సేల్స్ పెరుగుతుండడంతో షాపులు దక్కించుకున్న వ్యాపారులకు గణనీయంగా లాభాలు వస్తున్నాయి. దీంతో మద్యం దుకాణాలకు ఎక్కువ మంది పోటీ పడుతుంటారు. కానీ ఉమ్మడి జిల్లాలో ఈ సారి ఇందుకు భిన్నంగా జరిగింది. దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య ఈ సారి గణనీయంగా తగ్గింది. గతంతో పోలిస్తే దరఖాస్తులు భారీ సంఖ్యలో తగ్గాయి. మొదటి నుంచి దరఖాస్తులు చేసుకునే వారి సంఖ్య తక్కువగానే ఉంది. అయితే గత శనివారం రోజు మాత్రం అత్యధికంగా 10 వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. మళ్లీ గడువు పొడిగించినప్పటికీ పెద్దగా దరఖాస్తులు రాలేదు. మద్యం దరఖాస్తులు గణనీయంగా తగ్గడానికి సిండికేట్లే కారణంగా తెలుస్తోంది. కొన్నాళ్లుగా మద్యం వ్యాపారాన్ని ఆ కొందరే శాసిస్తున్నారు. వారి కనుసన్నల్లోనే మద్యం వ్యాపారం జరుగుతోంది. దుకాణాలకు దరఖాస్తు రుసుము పెంచడంతో వ్యాపారులంతా ఏకమయ్యారు. కొందరు రాజకీయ నాయకులను, ధనవంతులను, ఇతర వ్యాపారులను కలుపుకుని సిండికేట్‌గా ఏర్పాటై మద్యం షాపుల దరఖాస్తులపై ప్రభావం చూపించారు. నోటిఫికేషన్ విడుదల కాకముందు నుంచే మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు అనుసరించాల్సిన వ్యూహాలను అమలు చేశారు. రిజర్వేషన్ వర్గాలకు కేటాయించిన దుకాణాలకు దక్కించుకునేందుకు ఆయా వర్గాల వారి పేరుతో దరఖాస్తులు అందజేయడం గమనార్హం.

చివరి రోజు వెయ్యి లోపే..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 514 మద్యం దుకాణాలకు బుధవారం వరకు 27,963 దరఖాస్తులు అందాయి. చివరి రోజైన గురువారం మూడు జిల్లాల్లో 500లోపే దరఖాస్తులు అందాయి. చివరి రోజు కనీసం 5వేల దరఖాస్తులు వస్తాయని అంచనా వేశారు. కానీ 500లోపుగానే రావడం గమనార్హం. ఇందులో అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలోనే 300 వరకు వచ్చాయి. డివిజన్ల వారీగా చూస్తే శంషాబాద్ డివిజన్‌లో అత్యధికంగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. తర్వాత సరూర్‌నగర్, మేడ్చల్‌లో ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. అతి తక్కువగా వికారాబాద్‌లో దరఖాస్తులు వచ్చాయి.

సుమారు రూ.862 కోట్ల ఆదాయం

ఇదిలా ఉంటే గతంలో మద్యం షాపుల కోసం ఉమ్మడి జిల్లాలో 38 వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. అయితే ఈ సారి 28వేలకుపైగానే వచ్చాయి. అంటే దాదాపు 10వేల దరఖాస్తులు తక్కువ వచ్చాయి. అప్పట్లో ఒక్కో దరఖాస్తుకు రూ. 2లక్షల రుసుముగా నిర్ణయించారు. ఇది నాన్ రిఫండబుల్ కావడంతో దరఖాస్తుల ద్వారానే ప్రభుత్వానికి భారీ ఆదాయం వచ్చేది. ఇలా దరఖాస్తుల స్వీకరణ ద్వారానే గతంలో ఉమ్మడి జిల్లాలో దాదాపు రూ.800కోట్ల వరకు ప్రభుత్వానికి ఆదాయం వచ్చింది. అయితే ఇపుడు కొత్త మద్యం దుకాణాలు కేటాయింపుకు సంబంధించి దరఖాస్తు రుసుము రూ.3లక్షలుగా నిర్ణయించారు. కేవలం దరఖాస్తుల స్వీకరణ ద్వారానే ఉమ్మడి జిల్లాలో రూ.వేయి కోట్లకుపైగా ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని భావించారు. అయితే ఇపుడు దరఖాస్తులు భారీగా తగ్గడంతో రూ.862 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది. గతంలో కంటే ఈ సారి దరఖాస్తు రుసుము పెంచినప్పటికీ ఆదాయం మాత్రం పెరగకపోవడం గమనార్హం.

వికారాబాద్ జిల్లా మద్యం దరఖాస్తుల వివరాలు

సర్కిల్	మద్యం దుకాణాలు	వచ్చిన దరఖాస్తులు 2023	వచ్చిన దరఖాస్తులు 2025	వచ్చిన ఆదాయం(రూ.కోట్లలో) 2023	వచ్చిన ఆదాయం(రూ.కోట్లలో) 2025
తాండూరు	18	583	452	11.66	13.56
వికారాబాద్	15	866	484	17.32	14.52
పరిగి	12	564	481	11.28	14.43
కొడంగల్	08	275	204	5.50	6.12
మోమిన్‌పేట్	06	349	187	6.98	5.61
మొత్తం	59	2637	1808	52.74	54.24

హత్యాచారం చేసిన

నిందితుల అరెస్ట్

కొత్తూర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని మహిళపై తప్పతాగిన యువకులు లైంగికదాడి చేసి హత్య చేసి 6 నెలలుగా తప్పించుకుని తిరుగుతుండగా, పోలీసులు వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ జి.నర్సయ్య తెలిపిన వివరాలు ప్రకారం.. శేరిగూడ భద్రాయపల్లికి చెందిన 40ఏళ్ల ఓ మహిళ మతిస్థిమితం లేక తిరుగుతుండేది. గత ఏప్రిల్‌లో గ్రామంలో బీరప్ప ఉత్సవాలు జరిగాయి. ఏప్రిల్ 30న రాత్రి కోళ్లపడకల్ రోడ్డులో కొందరు యువకులు మద్యం తాగి ఉండగా.. అటుగా వచ్చిన మహిళకు మద్యం తాగించి సామూహిక అత్యాచారం చేసి తలపై రాళ్లతో మోది పరారయ్యారు. తీవ్ర గాయాలతో మహిళ అపస్మారకస్థితికి చేరుకుంది. మరుసటి రోజు ఆమె కుటుంబ సభ్యులు గమనించి ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మహిళ మృతిచెందింది. అప్పటి ఇన్‌స్పెక్టర్ నర్సింహారావ్ కేసు నమోదు చేశారు. నిందితులు తప్పించుకొని తిరుగుతున్నారు. పోస్టుమార్టం రిపోర్టులో అత్యాచారం జరిగినట్లు నిర్ధారణైంది. ఇంతలో నర్సింహారావ్ బదిలీ అయ్యారు. నూతన ఇన్‌స్పెక్టర్ జి.నర్సయ్య మహిళ హత్య కేసుపై దృష్టి సారించారు. నిందితుల కోసం మూడు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం గ్రామ శివారులో దండు చందు, కుమ్మరి నరేష్, కొండపల్లి వెంకటేష్, కొండపల్లి శ్రీశైలంలను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించగా నిజాలు బయటకొచ్చాయి. మద్యం మత్తులో మహిళపై అత్యాచారం చేశామని, పరువుపోతుందని రాళ్లతో కొట్టి చంపినట్లు నిందితులు నేరాన్ని ఒప్పుకున్నారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ నర్సయ్య పేర్కొన్నారు. నిందితులను అరెస్ట్‌తో గ్రామస్తులు పోలీసులపై ప్రశంసలు కురిపిస్తున్నారు. కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్ నర్సయ్య, క్రైమ్ ఎస్ఐ శ్రీనివాసాచారి, కానిస్టేబుళ్లు కుమార్, రవికుమార్, మహిపాల్‌లను శంషాబాద్ ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్ అభినందించారు.

ఇసుక లొల్లి

» ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక తోడుకోనివ్వని గ్రామస్తులు

» కాగ్నా నదిలో ట్రాక్టర్లను అడ్డుకున్న నవాంద్గి వాసులు

» ట్రాక్టర్ల యజమానులు, గ్రామస్తుల మధ్య వాగ్వాదం

» రెవెన్యూ అధికారులకు తలనొప్పిగా మారిన ఇసుక అనుమతుల వ్యవహారం


కాగ్నానది ఒడ్డున ట్రాక్టర్ల యజమానులు, గ్రామస్తుల మధ్య పంచాయితీ

బషీరాబాద్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక తరలింపు అంశం రెవెన్యూ అధికారులకు తలనొప్పిగా మారింది. ఇళ్లకు ఇసుక అనుమతిలిస్తే ఆయా గ్రామాల ప్రజలు అడ్డుకుంటుండటంతో నిత్యం ఘర్షణలు జరుగుతున్నాయి. గురువారం నవాంద్గి కాగ్నానదిలో ఇసుక తరలింపునకు అధికారులు అనుమతులిస్తే గ్రామస్తులు అడ్డుకోవడం ఉద్రిక్తతకు దారితీసింది. ఇసుక కోసం భారీ సంఖ్యలో ట్రాక్టర్లు నది వద్దకు చేరాయి. దీంతో సమాచారం అందుకున్న గ్రామస్తులు అక్కడికి చేరుకున్నారు. ఎత్తిపోతల పథకం(లిఫ్ట్ ఇరిగేషన్) ఉందని, ఇసుక తవ్వకాలతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపంటలకు నీరందదని రైతులు మండిపడ్డారు. ట్రాక్టర్లలో ఇసుక నింపనివ్వలేదు. ఇసుక తోడుకునేందుకు అధికారులు అనుమతిచ్చారని ట్రాక్టర్ల యజమానులు చెప్పినా గ్రామస్తులు వినలేదు. గ్రామస్తులు, ట్రాక్టర్ల యజమానుల మధ్య తీవ్ర గొడవ జరిగింది. ఒక దశలో కొట్టుకునే స్థాయికి వెళ్లారు. దీనిపై సమాచారం అందుకున్న తహసీల్దార్ ఆర్ఐ నాగార్జున్‌రెడ్డి, సిబ్బందిని అక్కడికి పంపారు. ఇక్కడి నుంచి ఇసుక తీసుకెళ్లనివ్వం అని ఆర్ఐతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గ్రామంలో ఆలయ నిర్మాణానికి ప్రతీ ఇసుక ట్రాక్టర్ ట్రిప్పునకు రూ.500 చొప్పున ఇచ్చేవారని, ఇప్పుడు కూడా ఇస్తేనే ఇసుక అనుమతిస్తామని నవాంద్గి వాసులు ఆర్ఐతో అన్నారు. ఇందిరమ్మ ఇళ్లకైనా ఊరికే వదలం అన్నారు. ఈ వ్యవహారంపై గ్రామస్తులు, ట్రాక్టర్ల యజమానులు తెల్చుకోవాలని, ఇసుక తరలింపును అడ్డుకోవద్దని ఆర్ఐ సర్దిచెప్పి వెళ్లిపోయారు. ఇదిలా ఉంటే ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక దొరకడంలేదని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సిద్ధాపూర్‌లో పులి సంచారం?

● భయం గుప్పిట్లో గ్రామస్తులు ● పులి ఆనవాళ్లు లేవు

● తేల్చి చెప్పిన ఫారెస్ట్ అధికారులు

కొత్తూర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మండలం సిద్ధాపూర్ శివారులో గురువారం సాయంత్రం పులి సంచరించిందని తెలుస్తోంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్ధాపూర్ నుంచి బైర్‌ఖాన్‌పల్లికి వెళ్లే మార్గంలో పులి రోడ్డు దాటి పొదల్లోకి వెళ్లిందని ఓ వాహన డ్రైవర్ గ్రామస్తులకు తెలిపాడు. దీంట పులి సంచారంపై గ్రామంలో పుకార్లు లేవడంతో గ్రామస్తులు భయాందోళనలు చెందారు. అటవీ ప్రాంతంలో పులి ఉంటే పోతుందని బాణసంచా పేల్చారు. పులి సంచారంపై గ్రామస్తులు ఫారెస్ట్ రేంజర్లకు సమాచారం ఇచ్చారు. దీంతో డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి రవీందర్‌రెడ్డి, సెక్షన్ అధికారి రవీందర్ పులి కన్పించిందని చెప్పిన ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ పులి పాదముద్రలు గానీ, ఇతర గుర్తులేమీ లేవన్నారు. అయినా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అనుమానం ఉంటే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ఫారెస్ట్ అధికారులు గ్రామస్తులకు సూచించారు.


మోమిన్‌పేట్: ఎయిర్‌పోర్టులో స్పీకర్‌కు స్వాగతం పలుకుతున్న మండల కాంగ్రెస్ నాయకులు


మర్పల్లి: ప్రసాద్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు ఘన స్వాగతం


వికారాబాద్: స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు

వికారాబాద్/మోమిన్‌పేట్/మర్పల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్ ముగించుకుని గురువారం స్వదేశం చేరుకున్న అసెంబ్లీ స్పీకర్ జి.ప్రసాద్ కుమార్‌కు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఉత్తర అమెరికాలోని బార్బడోస్‌లో జరిగిన 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ కాన్ఫరెన్స్‌లో స్పీకర్ ప్రసాద్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం స్టడీ టూర్‌లో భాగంగా ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఇటలీ దేశాల్లో పర్యటించిన ఆయన స్వదేశానికి తిరిగివచ్చారు. ఈ సందర్భంగా శంషాబాద్ విమానాశ్రయంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు, వ్యక్తిగత సిబ్బంది స్పీకర్‌కు ఘన స్వాగతం పలికారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు మోమిన్‌పేట్ మండల కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శంకర్‌యాదవ్, నాయకులు సుభాష్‌గౌడ్, మానెయ్య, సురేందర్, సోమారపు రవి, సిరాజుద్దీన్, ఏరాజ్‌పాషా తదితరులు గజమాలతో సన్మానించారు. విదేశీ పర్యటన ముగించుకొని స్వదేశానికి తిరిగి వచ్చిన స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు మర్పల్లి కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్టులో మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆయనను గజమాలతో సన్మానించారు.


పోలీసులతో వాగ్వాదానికి దిగిన శ్రీకాంత్ బంధువులు

ఆస్పత్రి వద్ద మృతుడి బంధువుల ఆందోళన

» వైద్యుల నిర్లక్ష్యం వల్లే యువకుడు చనిపోయాడని ఆరోపణ

» తక్కుగూడలో ధర్నా


శ్రీకాంత్(ఫైల్)

మహేశ్వరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన పహాడిషరీఫ్ పోలీసుస్టేషన్ పరిధి తుక్కుగూడలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని బాలాపూర్ మండలం మల్లాపూర్‌నకు చెందిన శ్రీకాంత్(21) డీసీఎం డ్రైవర్‌గా పనిచేసేవాడు. బుధవారం రాత్రి బైక్‌పై వెళ్తున్న శ్రీకాంత్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం తుక్కుగూడలోని శ్రీ విశిష్ట ఆస్పత్రిలో చేర్చారు. శ్రీకాంత్‌కు చికిత్స చేసిన వైద్యులు సిటి స్కాన్ చేయాలని సూచించగా అతడి కుటుంబసభ్యులు స్పందించలేదు. బుధవారం అర్ధరాత్రి శ్రీకాంత్ పరిస్థితి విషమించడంతో నగరంలో ఓవైసీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీకాంత్ గురువారం మధ్యాహ్నం చనిపోయాడు. తమ కుమారుడి మృతికి విశిష్ట ఆస్పత్రి వైద్యులే కారణం అని శ్రీకాంత్ కుటుంబీకులు ఆసుపత్రి వద్ద ధర్నాకు దిగారు. వైద్యులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలంటూ శ్రీశైలం-హైదరాబాద్ రహదారిపై ఆందోళన చేశారు. పహాడిషరీఫ్ పోలీసులు చేరుకొని వారితో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని చెప్పినా ఆందోళన విరమించలేదు. తుక్కుగూడలో గంట పాటు ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. శ్రీకాంత్ మృతిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లతో సొంతింటి కల సాకారం

● కాంగ్రెస్ నాయకులు.. ఇళ్ల పనుల పరిశీలన

తలకొండపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల సొంతింటి కల సాకారం అవుతుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. అర్హులైన నిరుపేదలందరికీ ప్రభుత్వం దశలవారిగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని తెలిపారు. తలకొండపల్లి మండలం వెల్జాల గ్రామంలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కొత్తగా ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేసుకోవాలని సూచించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో వెల్జాల గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎంపీటీసీ అంబాజీ, మాజీ ఉపసర్పంచ్ అజీజ్, నర్సింహ, నాయకులు ఆరీఫ్, కృష్ణయ్యగౌడ్, యూసుఫ్, లింగం, రాజు, మల్లేశ్, లక్ష్మణ్, విష్ణు, తిరుపతయ్య, వెంకటయ్యగౌడ్, పంచాయతీ కార్యదర్శి శరత్ తదితరులు ఉన్నారు.



తలకొండపల్లి : పనులు ప్రారంభిస్తున్న నాయకులు



కందుకూరు : ఇళ్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో సరిత

జాప్యం లేకుండా బిల్లుల చెల్లింపు

ఆమనగల్లు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు జాప్యం లేకుండా బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో మాధురి తెలిపారు. ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన చేసుకోవాలని సూచించారు. ఆమనగల్లు మండలం పోలెపల్లి, కొత్తకుంటతండాలో గురువారం ఎంపీడీవో పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. గ్రామంలో వందశాతం నిర్మాణం పూర్తి చేసుకున్న వెంకట్‌రెడ్డి ఇంటిని కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గృహనిర్మాణ శాఖ ఏఈ శాలిని, కార్యదర్శులు దేవేందర్, జగన్‌నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఈశ్వరయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

కందుకూరు : ఇందిరమ్మ ఇళ్ల పనుల్లో వేగం పెంచాలని ఎంపీడీవో బాణావత్ సరిత తెలిపారు. గురువారం మండల పరిధిలోని నేదునూరులో ఇళ్ల ఇండ్ల నిర్మాణాలను ఎంపీడీవో పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు కోసం మంజూరు చేసిన ఇళ్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దశలవారీగా బిల్లులు చెల్లించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో గీత, గ్రామ కార్యదర్శి రాజేష్, ఇందిరమ్మ ఇళ్ల మండల కో-ఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, గ్రామ అధ్యక్షుడు సురేష్, కారోబార్ మధు, లబ్ధిదారులు ఉన్నారు.



ఆమనగల్లు : ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో మాధురి



గ్రామస్తులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

వైద్యశిబిరాలను వినియోగించుకోవాలి

షాబాద్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని యూత్ కాంగ్రెస్ నాయకులు, ఫార్మసీ అసోసియేషన్ మెంబర్ భాస్కర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని నాగర్‌కుంటలో మమత అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్, బాలాజీ మెడికల్ కాలేజ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలోని 60 మందికి పైగా పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. భాస్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, మండల మాజీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి సహాయ సహకారాలతో వైద్యశిబిరం ఏర్పాటు చేశామన్నారు. విజయ్, హైమద్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



ఎమ్మెల్యే వంశీకృష్ణను సన్మానిస్తున్న శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నర్సింహ

కడ్తాల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకుపోవాలని అచ్చంపేట ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పథకాలు రూపొందించి అమలు చేస్తుందన్నారు. గురువారం ఎమ్మెల్యే వంశీకృష్ణను పీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డిలు మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి సత్కరించారు. వంశీకృష్ణ మాట్లాడుతూ సామాజిక న్యాయానికి కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్లకు పార్లమెంట్‌లో ఆమోదించకుండా అడ్డుకుంటుందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ఆయన అన్నారు.

సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం

● కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్

షాబాద్, అక్టోబర్ 23(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. మన్‌మర్రికి చెందిన శ్రీనివాస్ అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందేందుకు రూ.5 లక్షల ఎల్‌వోసీని గురువారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలాంటిదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఇచ్చిన హామీల మేరకు మాట తప్పకుండా అమలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమౌతుందన్నారు. అదేవిధంగా ఆరు గ్యారెంటీలను తప్పక అమలు చేస్తామన్నారు.

27 నుంచి పత్తి కొనుగోళ్లు

ఆమనగల్లు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మార్కెట్ యార్డ్ పరిధిలో ఈనెల 27 నుంచి సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్ల ప్రారంభిస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతా నర్సింహ తెలిపారు. పత్తి కొనుగోళ్లకు మార్కెట్ యార్డ్ పరిధిలో 3 మిల్లులను సీసీఐ నోటిఫైడ్ చేసినట్లు తెలిపారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో గీత మాట్లాడుతూ రైతులు పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలన్నారు. దళారి వ్యవస్థను సమూలంగా నిర్మూలించి రైతులకు మద్దతు ధర కల్పించడానికి సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్ పరిధిలోని తలకొండపల్లి శ్రీనివాస మురుగన్ ఇండస్ట్రీస్, ఆమనగల్లు మండలం పోలెపల్లి అభిషేక్ కాటన్ మిల్స్, ఆకుతోటపల్లి ఎన్‌డీటీ కాటన్ ఇండస్ట్రీస్‌కు అనుమతి ఇచ్చినట్లు వెల్లడించారు. 8 శాతం తేమ పత్తికి కనీస మద్దతు ధర రూ.8,110 ప్రభుత్వం నిర్ణయించిందని, 9 తేమ శాతానికి రూ.8028, 10 శాతం ఉంటే రూ. 7,947, 11కు రూ.7,866, 12కు రూ. 7,785 సీసీఐ చెల్లిస్తుందని వెల్లడించారు. 12 శాతానికి పైగా తేమ ఉంటే కొనుగోళ్లు చేయరని, రైతులు పత్తిని ఆరబెట్టి చెత్తలేకుండా శుభ్రపరిచి కొనుగోలు కేంద్రాలకు తీసుకుపోవాలని చెప్పారు. పత్తి రైతులు దిగుబడి విక్రయానికి ముందుగా కపాస్ కిసాన్ మొబైల్ యాప్‌లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్‌పర్సన్ గీతానర్సింహ

నేడు కొత్తపేటలో వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

కేశంపేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపేటలో నేడు(శుక్రవారం) వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్యాక్స్ చైర్మన్ గండ్ర జగదీశ్వర్‌గౌడ్ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే శంకర్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారని, రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు.

వైద్యురాలిపై చర్యలు తీసుకోండి

● ప్రమాదంలో గాయపడిన యువతి సోదరుడు
● వైద్యశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు

షాద్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రిలో ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న రోగి పట్ల నిర్లక్ష్యంగా ప్రవర్తించడంతో పాటు, ఆమె సోదరుడి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన డ్యూటీ డాక్టర్ సుప్రజపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రోగి సోదరుడు మిద్దెల సత్యనారాయణ గురువారం వైద్య శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కమ్యూనిటీ ఆస్పత్రిలో చికిత్స కోసం వస్తున్న రోగుల పట్ల ఆస్పత్రి వైద్యులు, వైద్య సిబ్బంది పూర్తిగా నిర్లక్ష్యంగా ప్రవరిస్తున్నారని, ఇదేంటని ప్రశ్నిస్తే నీలాంటి వారిని ఎంతోమందిని చూశామంటూ కరుకుగా సమాధానం ఇస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

వివరాల్లోకి వెళితే..

షాద్‌నగర్ పట్టణానికి చెందిన చెందిన పట్టణానికి చెందిన లావణ్య (42) అనే మహిళ చౌదరిగూడ మండలంలో వ్యవసాయ పనుల నిమిత్తం ఈనెల 17న వెళ్లింది. పనులు ముగించుకుని తిరుగు ప్రయాణంలో చౌదరిగూడ మండలంలో షాద్‌నగర్‌కు చెందిన ఆర్టీసీ బస్సు(టీజీ 7జడ్ 0045)లో ఎక్కారు. అనంతరం షాద్‌నగర్ పట్టణంలోని పరిగి రోడ్డులో ఆమె బస్సు దిగుతున్న క్రమంలో బస్సు డ్రైవర్ గ్రహించకుండా అతివేగంతో బస్సును ముందుకు తీసుకువెళ్లాడు. దీంతో లావణ్య బస్సుకింద పడి తీవ్ర గాయాల పాలయ్యారు. అక్కడున్న వారు డయల్ 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయగా షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ విధి నిర్వహణలో ఉన్న వైద్యసిబ్బంది, వైద్యురాలు సుప్రజ అపస్మారక స్థితిలో ఉన్న ఆమెకు చికిత్స అందించకుండా సెల్‌ఫోన్లో మాట్లాడుతూ పూర్తిగా నిర్లక్ష్యపూరితంగా వ్యవహరించారు. తన సోదరి గాయపడ్డ విషయాన్ని తెలుసుకున్న మిద్దెల సత్యనారాయణ వెంటనే కమ్యూనిటీ ఆస్పత్రికి చేరుకుని తన సోదరికి చికిత్స అందించాలని డాక్టర్‌ను వేడుకున్నారు. ఆమెకు ఏమీ కాలేదని, ఇలాంటివి ఎన్నో కేసులు చూశామని వైద్యురాలు బదులిచ్చారని సత్యనారాయణ పేర్కొన్నారు. అంతలోపే తన సోదరి వాంతులు చేసుకుందని, అపస్మారక స్థితిలోకి వెళ్లిందని వైద్యురాలికి మొరపెట్టుకున్నారు. దాంతో వైద్యురాలు వెంటనే ఆమెకు ఇంజక్షన్ ఇచ్చి ఉస్మానియాకు గానీ, ప్రైవేటు ఆస్పత్రికిగానీ తీసుకువెళ్లాలని సూచించింది. పరిస్థితిని గమనించిన సత్యనారాయణ తన సోదరిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. తలకు బలమైన గాయాలు కావడం వల్ల బ్రెయిన్‌కు ప్రమాదం వాటిల్లిందని, కొన్ని రోజుల పాటు చికిత్స అవసరమని అక్కడి వైద్యులు చెప్పడంతో ఆస్పత్రిలో చేర్పించారు. షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రిలో రోగులను ఏమాత్రం పట్టించుకోవడం లేదంటూ ఆయన వైద్య శాఖ ఉన్నతాధికారులతో పాటు, కమ్యూనిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు, ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని వెల్లడించారు.



సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేస్తున్న మిద్దెల సత్యనారాయణ

విచారించి చర్యలు తీసుకుంటాం

పేషెంట్ లావణ్య విషయంలో విధి నిర్వహణలో ఉన్న డాక్టర్ సుప్రజ నిర్లక్ష్యంగా ప్రవరించారంటూ ఆమె సోదరుడు మిద్దెల సత్యనారాయణ ఫిర్యాదు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు వైద్యసిబ్బంది, సీసీ కెమెరాలను పరిశీలిస్తాన్నారు. ఒకవేళ విధి నిర్వహణలో ఉన్న డాక్టర్ నిర్లక్ష్యంగా ప్రవరిస్తే ఆమెపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు తెలియపరుస్తామన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు



హోమంలో గిరిజనులు

కడ్తాల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధి కానుగుబావి తండాలో నూతనంగా నిర్మించిన శ్రీ తుల్జా భవానీ మాత దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల నేపథ్యంలో దేవాలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి వివిధ ప్రాంతాలకు చెందిన తండా గిరిజనులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తండాలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. వేడుకల్లో భాగంగా రెండోరోజు గురువారం వేద పారాయణం, మండప పూజ, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. తండాలో గిరిజనులు ఊరేగింపు నిర్వహించారు. తండా నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు బీక్యానాయక్, పాండు, బీచ్యానాయక్, నర్సింగ్, బీచ్య, లక్ష్మణ్, నరేశ్, జాన్య, రాజు, దేవుల, రతన్, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ జయశ్రీకి సన్మానం

కడ్తాల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కడ్తాల మండలం నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన జయశ్రీని గురువారం కడ్తాల 765 హైటెన్షన్ విద్యుత్ లైన్ భూ నిర్వాసితులు మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక మాజీ ఉపసర్పంచ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు కడారి రామకృష్ణ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. పంట పొలాల మీదుగా తలపెట్టిన విద్యుత్‌లైన్ అలైన్‌మెంట్‌ను మార్చేలా చూడాలని తెలిపారు. నెలల కాలంగా విద్యుత్ లైన్ అలైన్‌మెంట్ మార్పునకు చేస్తున్న ఆందోళన కార్యక్రమాలను భూ నిర్వాసితులు తహసీల్దార్‌కు వివరించగా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని తెలిపారు. సన్మానించిన వారిలో గూడూరు పెంటారెడ్డి, రాములు, పర్వత్‌కుమార్, గణేశ్, సత్యం, శివ, యాదయ్య, శేఖర్ రెడ్డి, జంబులు, అశోక్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



ఇంటి నిర్మాణానికి ఆర్థికసాయం

షాద్‌నగర్ రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం కాంసాన్‌పల్లి మాజీ సర్పంచ్ పద్మా నరేందర్‌రెడ్డి దంపతులు ఉదారత చాటుకున్నారు. గ్రామానికి చెందిన వడ్డె మంగమ్మ దంపతులు ఇల్లు నిర్మించుకుంటున్నారు. ఆర్థిక స్థోమత సరిగా లేకపోవడంతో ఇతరుల ద్వారా విషయం తెలుసుకున్న పద్మా నరేందర్‌రెడ్డి గురువారం రూ. 30వేల ఆర్థికసాయం అందించారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్

కేశంపేట/షాద్‌నగర్ రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గో సంరక్షక్ ప్రశాంత్ అలియాస్ సోనుసింగ్‌పై దాడి జరిగిన నేపథ్యంలో బీజేపీ నాయకులను ముందస్తు అరెస్ట్ చేశారు. అక్రమంగా గోవులు తరలిస్తున్న వ్యక్తులు బుధవారం ప్రశాంత్‌ను తుపాకీతో కాల్చారు. సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. పరామర్శించడానికి గురువారం బీజేపీ నాయకులు వెళ్తారనే అనుమానంతో కర్రెడ్ల నరేందర్ రెడ్డి, పాలాది శ్రీనివాస్, నరసింహ, శ్రీను, మహేష్‌లను వారి గ్రామాల్లో అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అలాగే ప్రశాంత్ కుమార్ సింగ్‌పై కాల్పులు జరిపిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం షాద్‌నగర్‌లో హిందూ వాహిని, భజరంగ్‌దళ్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ముఖ్య కూడలిలో నిరసన చేసిన నాయకులు దుండగుల దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం అక్కడికి చేరుకున్న పోలీసులు వారిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో చెట్ల వెంకటేష్, రమేష్, వంశీ, శ్రీనివాస్, శ్రావన్, మహేష్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టా భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలి

యాచారం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ కోసం ప్రభుత్వం సేకరించిన పట్టా భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించడంతో పాటు ఆన్‌లైన్‌లో రైతుల పేర్లు నమోదు చేయాలని సీపీఎం యాచారం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్‌లో రైతుల పేర్లు నమోదు చేసి రైతు భరోసా లాంటి పథకాలు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 26న యాచారంలో పాషానరహరిల వర్ధంతి సభలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం పాల్గొంటారని చెప్పారు. ఈ సభకు భారీఎత్తున జన సమీకరణ చేయాలని కార్యకర్తలను కోరారు. పి.బ్రహ్మయ్య, జంగయ్య, కె.జగన్, చందూనాయక్, దంతుక పెద్దయ్య, లాజర్ తదితరులున్నారు.

రిజర్వేషన్ ఇచ్చే వరకూ పోరాడతాం

షాబాద్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇచ్చే వరకు పోరాడుతామని బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు అన్నారు. బీసీ రిజర్వేషన్ సాధన సమితి షాబాద్‌లో నిర్వహిస్తున్న రిలే నిరహార దీక్ష గురువారం 12వ రోజుకు చేరింది. షాబాద్ మండల యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు. బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు వెంకట్‌యాదవ్, రవీందర్, రాజేందర్‌గౌడ్, రవీందర్ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, చేవెళ్ల స్వామి, కుమ్మరి చెన్నయ్య, మద్దూరి పాండు, దర్శన్, చంద్రయ్య, రాము, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

శంకర్‌పల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని అపలేరని చేవెళ్ల నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షుడు వెంకటయ్య అన్నారు. మోకిల పోలీసులు గురువారం ఉదయం వెంకటయ్యను గృహనిర్బంధం చేశారు. ఆయన మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్ సాధనలో భాగంగా జాతీయ బీసీసంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య రాజ్‌భవన్ ముట్టడికి పిలుపునివ్వగా, పోలీసులు తనను అక్రమంగా గృహనిర్బంధం చేశారని తెలిపారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన అశోక్

కడ్తాల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతమ్‌ను గురువారం కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ కడ్తాల మండల అధ్యక్షుడు పోతుగంటి అశోక్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని మాసబ్ ట్యాంక్ ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో కలిసి ఏఐసీసీ కో-ఆర్డినేటర్‌గా నియమితులైనందుకు పూలమాల, శాలువాలతో అశోక్ సత్కరించి అభినందించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ ఎస్సీ యువకులకు రుణాలు అందించాలని, మండలాభివృద్ధికి ప్రభుత్వపరంగా తోడ్పాటునందించాలని కోరినట్లు అశోక్ తెలిపారు.

చిన్నారుల మృతి పట్ల ఎమ్మెల్యే కసిరెడ్డి సంతాపం

కడ్తాల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో కడ్తాల్ మండలంలోని ముద్విన్ గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులు మృతి చెందడం పట్ల కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. యాచారం మండలంలోని తమ్మలోని గూడెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అభిరామ్, రాము మృతదేహాలను ఇబ్రహీంపట్నం ప్రభుత్వాసుపత్రిలో ఎమ్మెల్యే పరిశీలించి సంతాపం తెలిపారు.



మృతదేహాలను పరిశీలిస్తున్న కసిరెడ్డి

విద్యార్థుల సంఖ్య పెంచాలి

ఆమనగల్లు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వసతి గృహంలో విద్యార్థుల సంఖ్య పెంచాలని ఎంపీడీవో మాధురి అన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని గురువారం రాత్రి ఆమె సందర్శించారు. వసతి గృహ రికార్డులు, గదులను, పరిసరాలు, మరుగుదొడ్లు, మూత్రశాలలను పరిశీలించారు. ఎంపీడీవో తనిఖీ సమయంలో వసతి గృహంలో 34 మంది విద్యార్థులకు 12 మంది మాత్రమే ఉన్నారు. ఉన్న విద్యార్థులకు మెనూ ప్రకారం చికెన్ భోజనం అందించడం సంతృప్తి వ్యక్తం చేశారు. వసతి గృహ అధికారి ఎస్వీ రెడ్డికి పలు సూచనలు చేశారు. విద్యార్థులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో ఎనిమిది మందికి తీవ్ర గాయాలు

కొందుర్గు/కందుకూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రమాదాల్లో ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఓ పార్టీకి చెందిన యువనాయకుడు మద్యం మత్తులో కారు నడుపుతూ ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. గాయపడిన వారిని రక్షించే ప్రయత్నం చేయకుండా పారిపోయే ప్రయత్నం చేశాడు. ఈ ఘటన కొందుర్గు మండలం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రవీందర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం తుర్కఎన్కెపల్లికి చెందిన మట్టి మధు, విశాల్ పర్సనల్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్(బంజారా)లో కూలి పనులు ముగించుకొని కొందుర్గు వైపు వస్తున్నారు. ఈక్రమంలో వెనక నుంచి అతివేగంగా వచ్చిన బ్రిజా కారు బైకును కొందుర్గు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదుట ఢీకొట్టింది. దాంతో బైక్‌పై మధుతో పాటు నర్సింలు అనే వ్యక్తి ఉండగా ఇద్దరికీ కుడి చేయి, భుజం విరిగాయి. ఆ సమయంలో వీరివెంటే వస్తున్న కంపెనీ సూపర్‌వైజర్ వనం శ్రీధర్ పోలీసులకు సమాచారం అందించాడు. కారు నడుపుతున్న పసుపుల ప్రశాంత్ పారిపోయే ప్రయత్నం చేయగా అదుపులోకి తీసుకున్నారు. డ్రంకెన్‌డ్రైవ్ టెస్ట్ నిర్వహించగా మద్యం తాగినట్లు నిర్ధారణకొచ్చారు. బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై చెప్పారు.

పందులు ఢీకొట్టడంతో..

బైక్‌ను పందులు ఢీకొట్టడంతో ఓ కుటుంబానికి చెందిన ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, తెలిపిన వివరాల ప్రకారం.. కేశంపేట గ్రామానికి చెందిన మేదరి శేఖర్ తన భార్య జయశ్రీ, కుమారుడు తరుణ్‌తో కలిసి యాచారంలోని బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్లి తిరిగి గురువారం ఉదయం స్వగ్రామానికి బయలుదేరారు. ఈక్రమంలో మార్గమధ్యలోని కుందుకూరు గ్రామం నుంచి చౌరస్తాకు వచ్చే మార్గంలో జగర్‌కాంటా సమీపంలో పందులు గుంపుగా రోడ్డుపైకి వచ్చి బైక్‌ను ఢీకొట్టడంతో ముగ్గురూ కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. భార్యభర్తలు స్థానిక ఆసుపత్రిలో చికిత్సపొందగా, కుమారుడిని నగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు..

అలాగే ఆర్టీసీ బస్ బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కందుకూరు పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలంలోని విద్యానగర్ కాలనీకి చెందిన మిర్యాల కార్తీక్‌రెడ్డి(31) విద్యుత్ శాఖ కాంట్రాక్టులో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. హైదరాబాద్‌లోని సైఫాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. స్వగ్రామానికి వెళ్లేందుకు ఈనెల 22న రాత్రి 9గంటల ప్రాంతంలో బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలోని కందుకూరు మండల పరిధిలోకి రాగానే.. హైదరాబాద్ నుంచి అచ్చంపేట వెళ్తున్న ఆర్టీసీ బస్సు కందుకూరు మండల పరిధిలోని గూడూరు గేట్ వద్ద బైక్‌ను ఢీకొట్టింది. కార్తీక్‌రెడ్డికి కాలు విరగడంతోపాటు తీవ్ర రక్తగాయాలు కాగా.. స్థానికులు ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నగరంలోని ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించి వైద్యం అందిస్తున్నారు. ఆర్టీసీ బస్ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని కార్తీక్‌రెడ్డి తండ్రి సుదర్శన్‌రెడ్డి పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు.

కారు బైక్‌ను ఢీకొనడంతో..

కారు బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని నేదునూర్ గేట్ వద్ద చోటు చేసుకుంది. కడ్తాల్ మండలం మక్తమాదారం గ్రామానికి చెందిన, రాజు, నాని(17) టెంట్ షాపులో పని చేస్తున్నారు. పల్సర్ బైక్‌పై మక్తమాదారం గ్రామానికి ఇద్దరూ కలిసి వెళ్తున్నారు. మార్గమధ్యలోని గూడూర్ గేట్ వద్దకు రాగానే హైదరాబాద్ వెళ్తున్న కారు బైక్‌ను బలంగా ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న రాజుకు, నానికి తీవ్రగాయాలయ్యాయి. వెనుకల కూర్చున్న నాని కుడికాలు విరిగింది. అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కొత్తూర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కొత్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన నంబయ్య(55) అనే వ్యక్తి గురువారం ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఇన్‌స్పెక్టర్ నర్సయ్య తెలిపారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నంబయ్య జీవితం మీద విరక్తి చెందాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు.

సమయపాలన పాటించని అధికారులు

మహిళా సమాఖ్య కార్యాలయంలో ఖాళీగా కుర్చీలు



కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

కొందుర్గు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాల్సిన మహిళా సమాఖ్య అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహించడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం కొందుర్గు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో 11:30 అయినా కనిపించిన ఖాళీ కుర్చీలే ఇందుకు నిదర్శనం. ఏపీఎం హరిలాల్ సమయ పాలన పాటించకుండా నిర్లక్ష్యంగా వహిస్తున్నారు. జిల్లేడు చౌదరిగూడలో ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న, కొందుర్గు ఇన్‌చార్జి ఏపీఎం హరిలాల్ ఎక్కడా కనిపించకపోవడం విడ్డూరం. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని మండలంలో ఆరోపణలున్నా మరోసారి కార్యాలయానికి వెళ్ళినా సిబ్బంది కనిపించక పోవడం అందుకు నిదర్శనంగా నిలిచింది. ఏపీఎంను ఫోన్లో సంప్రదించగా షాద్‌నగర్‌లో ఉన్నట్లు సమాచారం చెప్పారు. కార్యాలయానికి వచ్చిన వారికి సమాచారం ఇవ్వడానికి అధికారులు అందుబాటులో లేకపోవడం గమనార్హం. ఉన్నతాధికారులు చర్యలు తీరుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రుణాల మంజూరులో మహిళా సంఘాలకు పెద్దపీట

తలకొండపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రుణాల మంజూరులో మహిళా సంఘాలకు పెద్దపీట వేస్తున్నట్లు యూనియన్ బ్యాంక్ ఏజీఎం బ్రహ్మం అన్నారు. పొదుపు సంఘాల మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా రాణించాలని కోరారు. తలకొండపల్లి మండలం చంద్రధనలో గురువారం మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా సంఘాల సమావేశం నిర్వహించారు. ఏపీఎం రామస్వామి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఏజీఎం బ్రహ్మం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెల్జాల ఎస్‌బీఐ పరిధిలో కొనసాగుతున్న 51 మహిళా సంఘాల ఖాతాలు తలకొండపల్లి యూనియన్ బ్యాంక్‌లోకి మార్చాలని కోరగా అధికారులు సానుకూలంగా స్పందించారు. ఖాతాలను యూనియన్ బ్యాంక్‌కు మార్చుకుంటే అన్ని విధాలా సహకారం అందిస్తామని ఏజీఎం బ్రహ్మం, మేనేజర్ ఆనంద్‌లు తెలిపారు. మహిళా సంఘాల సభ్యులకు పీఎంజేబీవై, పీఎంఎస్‌బీవై, పీఎంపీఏబీవై బీమా సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ అజయ్, ఏపీఎం రామస్వామి, సీసీలు బి.రాములు, పి.శ్రీశైలం, సి.దీప, సి.రామయ్య, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మల్లమ్మ, మాజీ సర్పంచ్ బక్కి కుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఏజీఎంను సన్మానిస్తున్న ఏపీఎం రామస్వామి తదితరులు